ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు

• మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


కోడూరు-2 నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిలమత్తూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన సచివాలయాలతో ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని 44వ నెంబరు జాతీయ రహదారి థామస్ మన్రో తోపులో కోడూరు-2 గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ సచివాలయాల ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లే బాధ తప్పిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్, జెడ్పీ చైర్మెన్ బోయ గిరిజమ్మ, చిత్తూరు జెడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు, సమన్వయ కర్త దీపిక, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

చిలమత్తూరు మండలంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయా పంచాయతీల నేతలు, ప్రజా ప్రతినిధులు పలు సమస్యలను విన్నవించుకున్నారు. ఈ మేరకు వీరాపురంలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించి కలెక్టర్‌తో పట్టాల పంపిణీ విషయం మాట్లాడారు. సబ్ స్టేషన్‌ను మంజూరు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. దేమకేతేపల్లి పంచాయతీలో తమ్మినాయినపల్లి గ్రామానికి రహదారి మంజూరైనా పనులు ప్రారంభం కాక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ తిరుమలేష్ మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయన ఖచ్చితమైన హామీ ఇవ్వగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కోడూరు థమస్ మన్రో తోపులో కమ్యూనిటీ భవనం ఆగిపోవడాన్ని సర్పంచ్ మురళి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే మదిరేపల్లి గ్రామ రహదారి నిర్మాణం విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించారు. వివిధ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించనున్నట్టు మంత్రి హామీ ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరు


ఎమ్మెల్యే తిప్పేస్వామిని సన్మానిస్తున్న శాంతమ్మ

మడకశిర: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని, మరోసారి వైఎస్‌జగన్ ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఆ పార్టీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ పేర్కొన్నారు. ఆమె శుక్రవారం రాత్రి మడకశిరలో స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈసందర్భంగా ఆమె ఎమ్మెల్యే తిప్పేస్వామితో కలిసి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని మంచి పనులను వైఎస్ జగన్ చేశారని తెలిపారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటించి పార్టీని గెలిపించడానికి కృషి చేస్తానని తెలిపారు. కలిసికట్టుగా పని చేసి వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. పార్లమెంట్ అభ్యర్థికి నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ అందిస్తామని తెలిపారు. పార్టీ శ్రేణులు శాంతమ్మకు పూర్తిగా సహకారం అందించాలని కోరారు. మండల కన్వీనర్ రామిరెడ్డి, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, గుడిబండ సింగిల్ విండో అధ్యక్షుడు చంద్ర, నాయకులు జయరాజ్, మంజునాథ్, నాగభూషణ్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, అంజన్, గుడిబండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన శాంతమ్మ

రొళ్ల: హనుమంతనపల్లిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ హెచ్‌బీ నర్సేగౌడును శుక్రవారం రాత్రి హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు హెచ్‌బీ నర్సేగౌడు శాంతమ్మకు పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. మడకశిర టౌన్ కన్వీనర్ పుట్ట కామప్ప, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వివేకానందుడి మార్గంలో నడవాలి


హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న యోగా సాధకులు

హిందూపురం టౌన్: ప్రతిఒక్కరూ స్వామి వివేకానంద మార్గంలో నడవాలని వక్తలు సూచించారు. శుక్రవారం పాండురంగ నగర్‌లోని వివేకానంద యోగా సెంటర్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి, వివేకానందుడి సూక్తులను వివరించారు. అనంతరం డాక్టర్ వెంకటరమణ నాయక్, యోగా సెంటర్ ముఖ్య కార్యదర్శి బద్రీ నారాయణ మాట్లాడుతూ వివేకానందుడి జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వెంకటేష్‌బాబు, యోగా సాధకులు రమేష్, సదానంద, రాము, బాలాజీ, మహేంద్ర, వెంకటేష్, శంకరప్ప, రాజేశ్వరీ, భారతి తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ఓ ఫంక్షన్ హాలులో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, జిల్లా ఇన్‌చార్జ్ బాలకృష్ణ యాదవ్, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, చిత్తూరు జిల్లా నాయకులు చిట్టిబాబు పాల్గొన్నారు.

బిట్స్ కళాశాలలో ..

హిందూపురం అర్బన్: తన బోధనలు, రచనలతో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి ప్రదాత అని చార్టెడ్ అకౌంటెంట్ బలరామకృష్ణ అన్నారు. శుక్రవారం బిట్స్ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన, క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు రామాంజనేయులు, అశోక్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పావగడ: స్వామి వివేకానంద జీవితం నేటి యువత మార్గ దర్శకమని రామకృష్ణాశ్రమాధిపతి జపానంద స్వామిజీ పేర్కొన్నారు. స్థానిక ఎస్ఎస్‌కే రంగ మందిరంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంత్యుత్సవం, యువజనోత్సవం నిర్వహించారు. చిక్కబళ్లాపురం ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ మాట్లాడుతూ స్వామి వివేకానందకు భారత రత్న బిరుదు ఇచ్చిన నాడే ఆయనకు నిజమైన నివాళులర్పించిన వారవుతామన్నారు. ఎమ్మెల్యే వెంకటేశ్ మాట్లాడుతూ తాను విద్య వైద్యానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఎంతో మంది పేద విద్యార్థులు, రోగులకు ఉచితంగా సేవలందించానన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి బిల్లప్ప మాట్లాడుతూ మానవీయ విలువలు లేని విద్య నిరర్థకమన్నారు. ఎస్ఎస్‌కే సంఘం అధ్యక్షుడు ఆనందరావు, బీఈఓ ఇంద్రాణమ్మ, ఇమ్రాన్ ఉల్లా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద జీవిత విశేషాలపై నిర్వహించిన వ్యాస రచన, చిత్ర లేఖనం, చర్చా పోటీల్లో విజయం సాధ/ ంచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయండి


సంక్షేమ పథకాలను వివరిస్తున్న చరణ్‌రెడ్డి

గోరంట్ల: త్వరలో జరగబోవు ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తాటిమాకులపల్లి, ముత్తరాయునితండా, వానవోలు తండా, బాచన్నపల్లి, ఉగ్రరాంపల్లి, పెట్టకుంటపల్లి గ్రామాల్లో ఆయన ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానుల ఇళ్లవద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో పనిచేయాలన్నారు. గ్రామాల్లో ప్రతి గడపకూ వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, బోయ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫకృద్దీన్ సాహెబ్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, స్థానిక సర్పంచ్ శ్రీరాములు, ఉప సర్పంచ్ బాబు, వానవోలు సింగిల్ విండో అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు రాఘవేంద్ర, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బయపరెడ్డి, జయరాంనాయక్, అంజినాయక్, గాండ్ల మల్లికార్జున, శ్రీనివాసులు, భాస్కరరెడ్డి, ఓబుళరెడ్డి, రంగారెడ్డి, రమణ నాయక్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరం పరిశీలన


గుడిబండ మండలం మోరుబాగల్‌లో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గోరంట్ల: మండల కేంద్రంలోని ఒకటో సచివాలయ ప్రాంగణంలో శుక్రవారం సర్పంచ్ సరోజబాయి ఆధ్వర్యంలో అధికారులు రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని డీఎల్‌డీఓ శివారెడ్డి పరిశీలించారు. శిబిరంలో రోగులకు పరీక్షలు చేసి, మందులు సక్రమంగా అందజేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథగుప్త, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజుపల్లిలో ఆరోగ్య సురక్ష శిబిరం

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం శుక్రవారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ వేదవతి, స్థానిక సర్పంచ్ మల్లక్క, వైస్ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సునీత, ఎస్సీ సెల్ పార్లమెంటరీ కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొని ప్రారంభించారు. పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు స్వరూపారెడ్డి, రుబీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యాధికారులు అప్తాబ్ నాగసింధు నేతృత్వంలో వైద్య పరీక్షలు చేశారు. మొత్తం 7 రకాల దీర్ఘకాలిక జబ్బులతో పాటు కంటి, జనరల్ పరీక్షలు చేశారు. మొత్తం 294 మందికి వైద్య పరీక్షలు చేయగా, అందులో 40 మందికి కంటి పరీక్షలు అవసరమని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వన్నప్ప, విలేజ్ హెల్త్ క్లినిక్ అసిస్టెంట్ లక్ష్మీకాంత్, సెక్రటరి నజ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గుడిబండ: మోరుబాగల్ సచివాలయ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులతో పాటు వైద్యనిపుణులు భారతి, రఘునందన్, తారకేశ్వర్ 185 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఆరోగ్య సురక్ష ద్వారా నిరుపేద ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని ఎంపీడీఓ రామారావు తెలిపారు. ఎంపీటీసీ రాజన్న, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు


అమరాపురంలో వాలీబాల్ అడుతున్న క్రీడాకారులు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలు ఘనంగా నిర్వహించారు. పెనుకొండలోని క్రికెట్ జట్ల మధ్య పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. పోటీలను ఎంపీడీఓ శివశంకరప్ప, కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, పీఈటీలు పర్యవేక్షించారు. పట్టణంలో ఆడుదాం- ఆంధ్రా క్రీడల్లో భాగంగా రెండు రోజు కబడ్డీ పోటీల్లో రాంపురం పురుషుల జట్టు విజయం సాధించింది. మండల స్థాయిలో విజయం సాధించిన గ్రామీణ జట్టు శుక్రవారం జరిగిన పోటీల్లో గెలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. కెప్టెన్ శ్రీనివాస్‌నాయక్, వైస్ కెప్టెన్ లక్ష్మీనారాయణ నాయక్ విజయంలో కీలక పాత్ర వహించారు. ఎంపీడీఓ శివశంకరప్ప పోటీలను పర్యవేక్షించారు.

అమరాపురం: అమరాపురం జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో శుక్రవారం మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పీఈటీలు మాట్లాడుతూ యువత, క్రీడాకారుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. క్రీడాకారులు పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, పీఈటీలు పాల్గొన్నారు.

లేపాక్షి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మొదటి స్థానంలో నిలిచిన 10 జట్ల క్రీడాకారులకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి తన సొంత నిధులతో రూ.50 వేలు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు లేపాక్షిలోని ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, నాయకులు శ్రీరామిరెడ్డి, శ్రీరాములు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చింత ఫలసాయం వేలం

అమరాపురం: తమ్మడేపల్లి పంచాయితీలోని చింత ఫలసాయాన్ని శుక్రవారం గ్రామ సచివాలయంలో అధికారులు వేలం వేశారు. దేవగానిపల్లిలో చింత చెట్లను భీరన్న రూ.90,000, గొడనకుంటలోని చింత చెట్లను హనుమంతరాయ రూ.18,500, తమ్మడేపల్లిలోని చింత చెట్లను నగేష్ రూ.10,500 దక్కించుకున్నారని అధికారులు తెలిపారు. చింత ఫలసాయం ద్వారా పంచాయితీకి రూ.1,19000 ఆదాయం వచ్చిందన్నారు. సర్పంచ్ గిరిజమ్మ, కార్యదర్శి మనోహరమ్, వ్యాపారులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రొద్దం: మండలంలోని కలిపి గ్రామంలో అనంతశక్తి సొసైటీ న్యాయసలహా మండలి ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. దిశ, గృహ హింస, వేధింపులు, బాల్యవివాహాలు తదితర చట్టాలపై మహిళలకు నాటిక రూపంలో అవగాహన కల్పించారు. అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య మాట్లాడుతూ ప్రతి మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల చట్టాలను తెలుసుకోవాలన్నారు. ఎక్కడైనా మహిళలు, గృహ హింస, వేధింపులకు గురైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాముడి అక్షింతల పంపిణీ


శ్రీరాముడి అక్షింతలు పంపిణీ చేస్తున్న రామసేవకులు

హిందూపురం టౌన్: అయోధ్య శ్రీరాముడి పవిత్ర అక్షింతలను రామసేవకులు శుక్రవారం పట్టణంలోని 24, 25వ వార్డుల్లో పంపిణీ చేశారు. వాసవీ ధర్మశాల రోడ్డు, కంసల పేట, వెంకటేశ్వర థియేటర్ రోడ్డు, మెయిన్ బజార్‌లోని ప్రతి ఇంటికీ వెళ్లి అక్షింతలు, రామమందిర చిత్రపటం, ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 22న సాయంత్రం 6 గంటలకు ప్రతి ఇంట్లోనూ ఐదు దీపాలు వెలిగించాలని వారు కోరారు. కార్యక్రమంలో రామ సేవకులు ఆదర్శ్ కుమార్, మంజునాథ్, కౌశిక్, చైతన్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై బహిరంగ సభ


మాట్లాడుతున్న అధికారులు

రొళ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సామాజిక తనిఖీ పై బహిరంగ సభ నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ అధికారి లక్ష్మీనారాయణ, డ్వామా పీడీ కె.విజయప్రసాద్ హాజరయ్యారు. మండలంలో 673 పనులకు గాను రూ.4.9 కోట్లు ఖర్చు చేయగా అందులో రూ.42,871 దుర్వినియోగమైనట్లు గుర్తించారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, ఎంపీపీ కవిత, ఎంపీడీఓ ఆజాద్, పీఈ నాగేశ్వరావు, ఎస్ఆర్పీ కాంతయ్య, సీఎల్ఆర్పీ కోఆర్డీనేటర్ లక్ష్మీనారాయణ, ఏపీఓ ఓబుళప్ప తదితరులు పాల్గొన్నారు.

అగళి: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సామాజిక తనిఖీపై బహిరంగ సభ జరిగింది. మండలంలో 143 పనులకుగాను రూ.6.70 ఖర్చు చేయగా రూ.3,1578 దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించారు. పీడీ విజయేంద్రప్రసాద్, డీఓ రమణారెడ్డి, ఎంపీడీఓ రవిప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

మోపురుగుండులో 'సామాజిక సమతా సంకల్పం'

గుడిబండ: మండల కేంద్రంలోని మోపురుగుండు గ్రామంలో శుక్రవారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కరుణాకర్ గౌడ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. సింగిల్ విండో అధ్యక్షుడు చంద్ర, ఈఓఆర్డీ నాగరాజు నాయక్, ప్రజాప్రతినిధులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న భక్తులు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో శుక్రవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రోగులకు అన్నదానం చేశారు. ఉదయం ఆస్పత్రికి రోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తాగునీటి సౌకర్యం కల్పించారు.

కొనసాగుతున్న 'వికసిత్ భారత్'

లేపాక్షి: మండలంలోని పులమతి, కోడిపల్లి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అశ్వత్తనారాయణ, మంజునాథ్, ఈఓఆర్డీ శివన్న, ఏఓ శ్రీలత, మెడికల్ సిబ్బంది సుబ్రమణ్యం, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ కౌన్సిలర్ మృతి

హిందూపురం: హిందూపురం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బోయ క్రిష్టప్ప (64) గురువారం సాయంత్రం కర్ణాటక బాగేపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆయన 1992లో కౌన్సిలర్‌గా సేవలు అందించారు. ఆయన కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని పలువురు కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు, నాయకులు సానుభూతి తెలిపారు.

నేడు పేట వెంకటరమణ స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

హిందూపురం: పట్టణంలోని పేట వెంకటరమణ స్వామి ఆలయంలో శనివారం ఉదయం 11 గంటలకు నూతన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణస్వీకారం జరుగుతుందని ఈఓ నరసింహమూర్తి శుక్రవారం తెలిపారు. అలాగే శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని మూలవిరాట్‌కు వెన్న అలంకరణతో తిరుప్పావడ సేవ 108 కిలోలు పులిహోర నివేదన ఉంటుందన్నారు. కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

మడకశిరరూరల్: సంక్రాంతి సందర్భంగా ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టామని శుక్రవారం ఎంపీపీ కవిత తెలిపారు. ఇప్పటికే తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో జేజేఎం కింద బోర్లు వేయించి పైపులైన్ ఏర్పాటు చేయించామన్నారు. సర్పంచులు కూడా గ్రామ కార్యదర్శుల సహకారంతో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టారని తెలిపారు. ఎక్కడైనా నీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హిందూపురం: హిందూపురం సబ్‌డివిజన్‌లోని హిందూపురం ప్రాంతంలో విద్యుత్ మరమ్మత్తుల కోసం మండలంలోని పలు ఏరియాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేష్ కుమార్ శుక్రవారం తెలిపారు. ముదిరెడ్డిపల్లి సెక్షన్ కొట్నూరు సబ్ స్టేషన్ పరిధిలోని ముదిరెడ్డిపల్లి ,సింగిరెడ్డిపల్లి ,కొల్లకుంట, కొట్నూర్, చిన్న గుడ్డంపల్లి, పెద్దగుడ్డంపల్లి, నందమూరి నగర్, మణే సముద్రం సబ్ స్టేషన్ పరిధిలోని మణే సముద్రం, మలూగురు, ఊటుకూరు, గొల్లపల్లి, ఎరగుంట్ల గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలన్నారు.

సోమందేపల్లి : మండలంలోని జూలకుంట, చాలకూరు, బ్రాహ్మణపల్లి, సోమందేపల్లి గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంజీవప్ప ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అభివృద్ధి పథంలో మడకశిర

మడకశిర: జిల్లాలో పూర్తిగా కర్ణాటక సరిహద్దులో మడకశిర నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథం వైపు దూసుకెళుతోంది. గత ప్రభుత్వంలో నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోయింది. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో మడకశిరలో దాదాపు రూ.20 కోట్లతో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటవుతోంది. అంతేకాకుండా మడకశిర హంద్రీ-నీవా బైపాస్ కెనాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.214.80 కోట్లు మంజూరు చేసింది. త్వరలోనే పనులు ప్రారంభించడానికి అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అంతేకాకుండా మడకశిర పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటుకు ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వరుసగా నాలుగేళ్లపాటు మడకశిర నియోజకవర్గానికి హంద్రీనీవా ద్వారా సాగునీరు అందించారు. దంతో పంటలు బాగా పండిస్తూ రైతులు ఆర్థికాభివృద్ధి సాధించారు. మడకశిర కేంద్రంగా అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటైంది. నియోజకవర్గ వ్యాప్తంగా 70 సచివాలయాల భవనాల నిర్మాణం కొనసాగుతోంది. కొడికొండ నుంచి మడకశిర మీదుగా శిర వరకు దాదాపు రూ.150 కోట్లతో హైవే నిర్మాణం పూర్తయింది. అగళి మండలంలోని రామనపల్లిలో రూ.4 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం చేసి లోఓల్టేజీ సమస్యను ప్రభుత్వం తీర్చింది. ఇదే మండలంలోని ఇనగలూరులో కూడా కొత్త విద్యుత్‌సబ్ స్టేషన్ భవన నిర్మాణ పనులను ప్రభుత్వం ప్రారంభించింది. వీటితో పాటు అనేక వివిధ అభివృద్ధి పనులు చేపట్టడంతో మడకశిర నియోజకవర్గం అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందనడంలో సందేహం లేదు.